ప్రజాశక్తి
ఆదివారం 11 జూన్ 2023
5
శ్రీకాకుళం



పోలీసు బందోబస్తు మధ్య 'గడప గడపకు'



పోలీసు బందోబస్తు మధ్య లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శాంతి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ గిరిజనుల నుంచి నిరసన సెగలు తగలడంతో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పోలీసు బందోబస్తు నడుమ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కేరాసింగి పంచాయతీలో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిరిజన గ్రామాల్లోకి ఎమ్మెల్యే రానీయకుండా కర్రలు అడ్డుపెట్టడం, అడ్డుకోవడం వంటి ఇటీవలి పరిణామాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తతో పాతపట్నం, మెళియాపుట్టి పోలీసుల బందోబస్తుతో గ్రామానికి వచ్చారు. ఎమ్మెల్యే తమ పంచాయతీకి వచ్చినా వైసిపికి చెందిన సర్పంచ్ పెదబంతు ఆదిలక్ష్మి ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. దీంతో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధిని వివరించారు. గ్రామస్తుల సమస్యలను అడగ్గా, బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని కోరారు.

నిర్వాసితుల అవస్థలు

- ఆఫ్‌షోర్ కాలనీల్లో అరకొరగా సౌకర్యాలు
- 39 రకాల పనులకు 13 మాత్రమే పూర్తి
- మౌలిక వసతులకు నిధుల విడుదలలో ఉదాసీనం
- రూ.21.42 కోట్లకు రూ.3.30 కోట్లే ఇచ్చిన ప్రభుత్వం



పనిచేయని మంచినీటి కుళాయి



పలాస మండలం కోసంగిపురం సమీపంలోని నిర్వాసిత కాలనీ

ప్రాజెక్టు పనులపై దృష్టిసారిస్తున్న ప్రభుత్వాలు, నిర్వాసితుల సమస్యలను విస్మరిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములిచ్చి, తమ ఆస్తులను వదులుకున్న నిర్వాసితులకు కన్నీళ్లనే మిగిలుస్తున్నాయి. గ్రామాలను ఖాళీ చేసి వచ్చినా, కాలనీల్లో సౌకర్యాలు లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నారు. తమ కాలనీల్లో మంచినీరు, రోడ్లు నిర్మించాలని నిర్వాసితులు మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరోవైపు కాలనీలో కనీస సౌకర్యాల కల్పనకు నిధులు విడుదల చేయడంలోనూ ప్రభుత్వం తీవ్ర ఉదాసీనత కనబరుస్తోంది. దీంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో 2008లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించారు. పలాస మండలంలోని రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణ పనులతో పలాస మండలం రేగులపాడు, నందిగాం మండలం శారదాపురం, చిన్నగురువూరు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించింది. వీరికి పునరావాసం కల్పించేందుకు పలాస మండలం రామకృష్ణాపురం, చీపురుపల్లి, గోపివల్లభపురం ప్రాంతాల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. రామకృష్ణాపురంలో పలు ప్రభుత్వ శాఖల కింద 16 రకాల పనులు చేపట్టగా, ఇప్పటివరకు ఏడు పనులు మాత్రమే పూర్తయ్యాయి. చీపురుపల్లిలో తాగునీటి పథకాలు, అంగన్‌వాడీ, సామాజిక భవనాలు తదితర 13 పనులు మంజూరు కాగా, నాలుగు పనులు మాత్రమే పూర్తయ్యాయి. తొమ్మిది రకాల పనులు కొనసాగుతున్నాయి. గోపివల్లభపురంలో పది రకాల పనులు చేపట్టగా, రెండు పనులు మాత్రమే పూర్తయ్యాయి. మరో మూడు పనులు ప్రగతిలో ఉన్నాయి. గ్రామీణ నీటి సరఫరా ద్వారా చేపట్టాల్సిన మరో పనికి టెండరు కూడా ఖరారు కాలేదు. కార్యాలయ భవనం పనులను ప్రారంభించి అర్థాంతరంగా నిలుపుదల చేశారు.

రూ.21.42 కోట్లకు రూ.3.30 కోట్లే విడుదల

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు కేటాయించిన పునరావాస కాలనీల్లో మౌలిక వసతులకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రామకృష్ణాపురం, చీపురుపల్లి, గోపివల్లభపురం ప్రాంతాల్లో నిర్మిస్తున్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, అంగన్‌వాడీ, సామాజిక భవనాలు తదితర పనులు పూర్తి కావాలంటే రూ.21.42 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం ఇప్పటివరకు రూ.3.30 కోట్లే విడుదల చేసింది. చీపురుపల్లి కాలనీలో చేపడుతున్న పనులకు రూ.10.03 కోట్లు అవసరం కాగా, రూ.1.80 కోట్లు మాత్రమే విడుదల చేసింది. మరో రూ.8.23 కోట్లను ఇవ్వాల్సి ఉంది. చీపురుపల్లి నిర్వాసిత కాలనీలో సౌకర్యాల కోసం రూ.4.45 కోట్లు కావాల్సి ఉండగా, రూ.75.10 లక్షలను మంజూరు చేసింది. కాలనీలో పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు రూ.3.70 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. గోపివల్లభపురం కాలనీకి రూ.6.94 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం రూ.74.57 లక్షలను మాత్రమే కేటాయించింది. కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాల కోసం రూ.6.19 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

ప్రాజెక్టు నిర్మాణంపైనే పాలకుల శ్రద్ధ

ఆఫ్‌షోర్ నిర్మాణం, ఆ కాంట్రాక్టును ఎవరికి కట్టబెట్టాలన్న అంశంపైనే గత టిడిపి ప్రభుత్వం శ్రద్ధ చూపిందే తప్ప నిర్వాసితుల జోలికి పోలేదు. పశుసంవర్థకశాఖ సీదిరి అప్పలరాజు పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆఫ్‌షోర్ పూర్తి చేస్తామని మాట చెప్పారే గానీ, నిర్వాసితుల పునరావాసంపై కనీసం మాట్లాడడం లేదు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఇందుకోసం నిర్వాసితులకు బలవంతంగానైనా తరలించాలని అధికారుల చర్చల్లో వినిపిస్తోంది. భూసేకరణ చట్టం-2013 ప్రకారం నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తర్వాతే వారిని గ్రామాల నుంచి పంపాల్సి ఉంటుంది. రిజర్వాయర్‌ను పూర్తి చేసి ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని చూస్తున్న ప్రభుత్వానికి, బలవంతంగా నిర్వాసితుల తరలింపు ఏరకంగా చూసుకున్నా నష్టదాయకమే. ప్రభుత్వం ఇప్పటికైనా పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంపై శ్రద్ధ చూపాలని అంతా కోరుతున్నారు.

కాలనీలో శ్మశానం లేదు



మంచి ప్యాకేజీ, అన్ని సౌకర్యాలతో ఇళ్లు కటించి ఇస్తామంటూ ప్రాజెక్టు కోసం భూములు అడిగిన సమయంలో చెప్పారు. ఇప్పుడు కాలనీలో నీళ్లు, రోడ్లు లేవు. కనీసం కాలనీలో శ్మశానం కూడా లేదు. కాలనీలో ఇబ్బందులపై అనేకసార్లు ఆర్‌డిఒ, తహశీల్దార్లను కలిశాం. సమస్యలు చెప్పాం. అయినా ప్రయోజనం కనిపించలేదు.

- ఎం.ఎన్ దాస్, శారదాపురం

పిల్లలూ ఇబ్బంది పడుతున్నారు



కాలనీలో స్కూల్ లేకపోవడంతో కాలనీకి దూరంగా ఉన్న స్కూళ్లకు పిల్లలను పంపుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రం, రోడ్లు, కాలువలు కూడా లేవు. రేషన్ సరుకులకూ ఇబ్బందులు పడుతున్నాం. మా సొంత ఊరు శారదాపురమే వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నాం.

- వై.రామయ్య, శారదాపురం

విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజలపై భారం

- ప్రభుత్వ విధానాల వల్లే సంక్షోభంలో విద్యుత్ రంగం
- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు

ప్రజాశక్తి - రణస్థలం

ప్రభుత్వం ఇష్టానుసారంగా విద్యుత్ ఛార్జీలను పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతోందని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు విమర్శించారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చే నాటికి విభజన రాష్ట్రంలో పవర్ హాలిడే, కరెంటు కోతలు ఉండేవన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన కొద్ది నెలల్లోనే 65 శాతం ఉన్నటువంటి థర్మల్, హైడ్రో, ప్రాజెక్టులను 89 శాతం వెళ్లగలిగేలా చేశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చేసరికి రాష్ట్రం మిగులు విద్యుత్ రాష్ట్రాల సరసన ఉండేదని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్ల విద్యుత్ రంగం సంక్షోభంలో ఉందన్నారు. 2022 ఏప్రిల్‌లో 50 మిలియన్ యూనిట్ల కొరతలో తీవ్ర సంక్షోభం నెలకొందని, పవర్ హాలిడేలు పరిశ్రమలకు ప్రకటించాల్సి వచ్చిందని గుర్తుచేశారు.

తాజాగా ట్రూఅప్, ఇతర ఛార్జీల పేరిట బిల్లులు పెంచేసి ప్రజల జేబులకు చిల్లులు పెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి ఆగిపోయిందని, వ్యవసాయ, ఆక్వారంగాలూ నష్టపోయాయని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనుకబడిపోయిందన్నారు. ఈ ఐదేళ్లూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండుంటే రాష్ట్రంలో అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉండేదని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో అన్నింటా బాదుడే తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదని విమర్శించారు. మరిన్ని పరిశ్రమలు రావడానికి, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి పదేళ్ల ప్రణాళికతో పనిచేసే ప్రభుత్వం అవసరమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళా వెంకటరావు

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసేందుకు కృషి

ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సాయిరాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసేందుకు తమవంతు కృషి చేస్తామని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సిఎం చొరవ తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ అందుకు సహకరించిన హనుమంతు సాయిరాంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాంట్రాక్టు ఉద్యోగుల సమాఖ్య నేతలు ఎన్‌జిఒ హోంలో శనివారం సత్కరించారు. తొలుత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి థాంక్యూ సిఎం సార్ అంటూ జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సాయిరాం మాట్లాడుతూ, అత్యధిక సంఘాల జెఎసి కలిగిన ఎన్‌జిఒ అసోసియేషన్ ఎప్పుడూ ఉద్యోగుల సంక్షేమం, ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో సంఘాలు పుట్టుకొస్తుండడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశాలు సన్నగిల్లాయన్నారు. సంఘ నేతల కృషి ఫలితంగా అధిక శాతం డిమాండ్లను నెరవేర్చుకోగలిగామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో సహకరించిన జిల్లా ప్రజాప్రతినిధులను ఈనెల 16న సత్కరించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘాల నేతలు డి.సాయిప్రసాద్, పి.మన్మథరావు, బి.మురళి, ఎ.సత్యనారాయణ, ఎస్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఆ అర్హత చంద్రబాబుకు లేదు

- 14 ఏళ్ల పాలనలో పేదల కోసం సెంటు భూమి కొన్నారా?
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పేదల ఇళ్ల కోసం పైసా ఖర్చు చేయని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు పేదల ఇళ్ల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా రాగోలు పంచాయతీ పరిధిలోని బావాజీపేటకు చెందిన 175 మంది నిరుపేదలకు పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు. ఆ రోజు అధికారం అనుభవించిన టిడిపి నాయకులు పేదల కోసం ఏం చేశారని ప్రశ్నించారు. 32 లక్షల మందికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేసి భూమిని కొని పట్టాలు ఇచ్చామని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లు సిఎంగా ఉండి, ఒక్క సెంటు భూమి అయినా పేదల కోసం కొన్నారా అని ప్రశ్నించారు. పట్టాలు అందుకున్న నిరుపేదలు ప్రభుత్వం నుంచి వచ్చే రుణ సదుపాయాన్ని అందుకుని వేగంగా ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం లబ్ధిదారులు మంత్రి ధర్మానకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రుప్ప దివ్య, తహశీల్దార్ వెంకటరావు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చిట్టి జనార్ధనరావు, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, సర్పంచ్ గేదెల చెంగలరావు, చిట్టి రవికుమార్, వై.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో సీనియార్టీకి ప్రాధాన్యం ఇవ్వాలి

స్పీకర్‌కు జలవనరుల శాఖ ఇంజినీర్ల వినతి

ప్రజాశక్తి - ఆమదాలవలస



స్పీకర్‌కు సమస్యలను వివరిస్తున్న జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు

జలవనరుల శాఖలో ఉద్యోగోన్నతుల్లో సీనియార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని స్పీకర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జోనల్ సీనియార్టీ సమస్యను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా ఇతర జోన్ల వాళ్లకు ఉద్యోగోన్నతులు కల్పించారని, దీనివల్ల జోన్-1 ఇంజినీర్లు తీవ్రంగా నష్టపోయారని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్య నేటికీ పరిష్కారం కాలేదని, జలవనరుల శాఖ ఉన్నతాధికారుల తీరే అందుకు కారణమని తెలిపారు.

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా జలవనరుల శాఖలో జరిగిన బదిలీల తుది జాబితాలో అర్హత పాటించకుండా, హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా బదిలీలు చేపట్టాలరని చెప్పారు. భవిష్యత్‌లో ఉద్యోగ విరమణలోనూ ఉత్తరాంధ్ర ఇంజినీర్లకు వాటిల్లే అన్యాయాన్ని గుర్తించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ విషయాన్ని ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. రాజ్యాంగబద్ధంగానే ఉద్యోగోన్నతులు చేపట్టాలని, గత ప్రభుత్వ హయాంలో తప్పిదాలను ముఖ్యమంత్రికి వివరిస్తానని చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో పర్యవేక్షక ఇంజినీర్లు ఎన్.రాంబాబు, డోల తిరుమలరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు జి.రామచంద్రరావు, ఎం.వి రమణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు మురళీమోహన్, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

60 రోజుల్లో అమలు చేస్తాం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయనున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. పెద్దపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల నాయకులు శనివారం మంత్రిని కలిసి సత్కరించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెండు దశాబ్దాల కలను నెరవేరుస్తూ క్రమబద్ధీకరణ నిర్ణయం తీసుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు రుణం తీర్చుకుంటామని మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు మన్మథరావు అన్నారు. వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వంలో విలీనం చేసి 010 పద్దు కింద ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతాలు చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో జూనియర్ కాలేజ్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొరబాబు, జిల్లా అధ్యక్షులు కె.నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, జెఎసి ఉపాధ్యక్షులు కె.వాసుదేవరావు తదితరులున్నారు.

ఇళ్ల పట్టాలను మంజూరు చేయరూ...

స్పీకర్‌ను కోరిన రామచంద్రపురంవాసులు



పట్టాను మంజూరు చేయాలని స్పీకర్‌ను కోరుతున్న లక్ష్మి

ఆమదాలవలస : ఉండడానికి ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని మండలంలోని రామచంద్రాపురం మహిళలు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. మండలంలోని చిన్న జొన్నవలసలో రూ.36 లక్షలతో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలను శనివారం ప్రారంభించారు. రామచంద్రాపురం, పొన్నంపేట కాలనీలో రూ.89.76 లక్షలతో జల్ జీవన్ మిషన్ పథకం కింద మంచినీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామచంద్రాపురంలోని కొల్లి లక్ష్మి ఇంతవరకు ఇంటి పట్టాను మంజూరు చేయలేదని స్పీకర్ ఎదుట వాపోయింది. స్పీకర్ వెంటనే అధికారులను పిలిచి రామచంద్రాపురం పంచాయతీలో గృహ నిర్మాణాలు ఎన్ని మంజూరు చేశారని, వాటిలో ఎన్ని పూర్తయ్యాయని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణి, విఆర్‌ఒ పవన్‌ను ప్రశ్నించారు. సొంత స్థలాలున్న 54 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశామని స్పీకర్‌కు తెలిపారు. ఇళ్ల స్థలాల పట్టాలను మంజూరు చేయడానికి స్థలంపై కొందరు కోర్టులో కేసు వేశారని, అందువల్ల పట్టాల పంపిణీ పూర్తి కాలేదని స్పీకర్ దష్టికి తీసుకొచ్చారు. ఇళ్లు లేని పేదలకు త్వరలోనే పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ చల్లా ఉష, మాజీ సర్పంచ్ చల్లా సింహాచలం, సర్పంచ్ ప్రతినిధి గొంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మూడ్‌లోకి తీసుకెళ్లేదెవరు?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

'ఎన్నికలకు ఇక తొమ్మిది నెలలే ఉన్నాయి. గడప గడపకు కార్యక్రమం ఒక్కటే కాదు. ఎన్నికల మూడ్‌లో వేగంగా పని చేయండి. అన్ని విధాలుగా సిద్ధం కండి' అంటూ ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హితబోధ చేశారు. నియోజకవర్గాలను పూర్తిగా చక్కదిద్దుకోండి, మీ జిల్లాల బాధ్యత మీదే. నియోజకవర్గాల్లో జిల్లాల్లో ఏవైనా గ్యాప్‌లు ఉంటే ఇప్పటి నుంచే సరిదిద్దుకోండంటూ దిశానిర్దేశం చేశారు. జిల్లాకు సంబంధించి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వీరిద్దరే చూసుకోవాల్సి ఉంటుందని అధినేత మాటలు చెప్పకనే చెప్తున్నాయి. ఇందులో అసమ్మతిని రాజేస్తున్నారంటూ విమర్శలు ఎదుర్కొంటున్న నేత ఒకరు, తన నియోజకవర్గంలో తీవ్ర అసమ్మతిని ఎదుర్కొంటున్న మరో నేత ఇప్పుడు ఆ బాధ్యతను తీసుకోవాల్సి ఉంటుంది. పార్టీలో గ్యాప్‌ను వీరెలా సరిదిద్దుతారా? అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.

పాతపట్నం నియోజవర్గంలోనూ అసమ్మతికి ఆజ్యం పార్టీ పెద్దలేనన్నది చర్చ నడుస్తోంది. పాతపట్నంలో ఎన్నికలకు మరో ఏడాది సమయం ఉన్న నేపథ్యంలో స్థానికత అంశాన్ని తెర పైకి మళ్లీ తెచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్థానికేతరులు కావడంతో ఆమెకు టిక్కెట్ రాకుండా అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారు. స్థానికుడే కావాలి, వారసత్వం పోవాలి అంటూ టిక్కెట్ ఆశిస్తున్న నియోజకవర్గానికి చెందిన తులసీ వరప్రసాద్, తేజేశ్వరరావు వంటి నాయకులు పోస్టర్లను వేసి మరీ ప్రచారం చేస్తున్నారు. రెడ్డి శాంతి ఒంటెత్తు పోకడలు, ఏకపక్షంగా వ్యవహరించడంపై కొత్తూరు వైస్ ఎంపిపి తులసీ వరప్రసాద్ తొలి నుంచీ గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. నియోజకవర్గ, పార్టీపరమైన సమస్యలపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కలుస్తున్నారు. దీంతో ఆయన అసమ్మతిని ప్రోత్సహిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజుకు వ్యతిరేకంగా అసమ్మతివర్గం తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తోంది. గతేడాది సెప్టెంబరులో వజ్రపుకొత్తూరు మండలం శారదాపురంలో మంత్రి అప్పలరాజుకు వ్యతిరేకంగా సమావేశమయ్యారు. గతేడాది నవంబరులో మందస మండలంలో మంత్రికి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించిన సందర్భాలూ ఉన్నాయి. ఆ తర్వాత పలాస మండలం కంబిరిగాం తోటలో మరో సమావేశం పెట్టారు. పార్టీలో కష్టపడి పనిచేసిన సీనియర్లకు విలువ ఇవ్వడం లేదని, రానున్న ఎన్నికల్లో అప్పలరాజుకు టిక్కెట్ కేటాయిస్తే ఓడిస్తామని అసమ్మతి నాయకులు బహిరంగంగానే చెప్తున్నారు. అధిష్టానం మంత్రికి టిక్కెట్ నిరాకరిస్తే, తామూ పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలియజేసేందుకు టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వైసిపిని రెండు గ్రూపులుగా వీడదీసి విభజించు, పాలించు తరహాలో నెరపిన రాజకీయాలు మంత్రికే చేటు తెచ్చాయనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది. పార్టీలో తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో సీనియర్లు మంత్రికి దూరమయ్యారు. వారిలో కొందరు తిరుగుబాటు చేయగా, మరికొందరు స్తబ్దుగా ఉండిపోయారు. సొంత ఇంటిని చక్కబెట్టుకోలేని పరిస్థితిలో ఉన్న మంత్రి అప్పలరాజు ఇతర నియోజకవర్గాల్లో గ్రూపుల పోరును ఏం చక్కదిద్దుతారని పార్టీ నాయకులు పెదవి విరుస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నుంచి మొదలైన పోరు ఇంతింతై వటుడింతై అన్నట్లు తీవ్ర స్థాయికి చేరింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుని ఇక్కడ నుంచి పోటీ చేసేందుకు పొరుగు జిల్లాకు చెందిన మంత్రి సోదరుడు ఒకరు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే గొర్లెకు పొగబెడుతున్నారని ఎమ్మెల్యే అనుచరులు అంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అంతా బాగానే ఉంటే మళ్లీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కే టిక్కెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. పార్టీలో ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని, గొర్లెకు ఇస్తే ఓడిపోతారని సంకేతాలు కల్పించడం ద్వారా కొత్త వారికి టిక్కెట్ ఇచ్చేలా చేయడంలో పొరుగు జిల్లా నాయకులు తమదైన శైలిలో వ్యూహరచనలు ఇప్పట్నుంచే సాగిస్తున్నారని తెలుస్తోంది. స్వయంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బంధువే అసమ్మతికి ఆజ్యం పోస్తుంటే, దాన్ని వీరిద్దరిలో ఎవరు మాత్రం ఆ తగవును తీర్చగలరు?.

టెక్కలి నియోజకవర్గంలో అసమ్మతికి తోడు కుటుంబ కలహాలు పార్టీకి ఇబ్బందికరంగా పరిణమించాయి. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత నుంచే దువ్వాడ శ్రీనివాస్ తీరును అక్కడి కేడర్ వ్యతిరేకించడం మొదలుపెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్ నాయకులకు ఎలాంటి పదవులూ రానివ్వకుండా దువ్వాడ అడ్డుకున్నారని, తన ఇంట్లో పనిచేసే వారికి పదవులు ఇప్పించుకున్నారన్న ఆరోపణలున్నాయి. సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని, ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన తమను మోసం చేశారన్న ఆవేదన నాయకుల్లో ఇప్పటికీ ఉంది. అవకాశం కోసం వారంతా ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. ఇదే సమయంలో దువ్వాడ కుటుంబంలో నెలకొన్న కలహాల నేపథ్యంలో శ్రీనివాస్ సతీమణి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలను చేపట్టారు. నియోజక వర్గం, కుటుంబంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దడం వీరికి కొంత క్లిష్టతరమైన పనే. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో వైసిపిని ఎన్నికల మూడ్‌లోకి తీసుకు వెళ్లేదెవరో చూడాల్సి ఉంది.


అభినందిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

రూ.13.5 లక్షల ప్యాకేజీతో 'కాకినాడ ఆదిత్య' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో తమ కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల బిసిఎ విద్యార్థి సందీప్ చౌదరి మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇప్జ (ఎర్నెస్ట్, యంగ్) కంపెనీకి రూ.13.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని ఆదిత్య డిగ్రీ కళాశాల కో-ఎడ్ ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శనివారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలో మొత్తం 16 మంది ఎంపిక కాగా, కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల కో-ఎడ్ బ్రాంచ్ నుంచి ఒకరు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ కాలం అనంతరం రూ.13.5 లక్షల వార్షిక వేతనం కంపెనీ అందజేస్తుందని అన్నారు. తమ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రముఖ కంపెనీల ఉద్యోగ అవకాశాలతో పాటు అత్యధిక వేతనాలతో ఎంపికయ్యే విధంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆయా కంపెనీలకు అవసరమయ్యే విధంగా డిగ్రీతో పాటు కోడింగ్ వంటి సబ్జెక్టుల్లోనూ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 11,400 మందికి ఉద్యోగాలు లభించాయని, ఒక్క శ్రీకాకుళం బ్రాంచ్ నుంచి 859 ఉద్యోగాలు లభించాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఎన్.సుగుణారెడ్డి, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.యల్.నాయుడు, బి.చక్రవర్తి పాల్గొన్నారు.


విజేతలతో కళాశాల యాజమాన్య ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీల్లో 'గాయత్రి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విజయనగరం జిల్లా రాజాం జిఎంఆర్ జిసిఎస్ఆర్ కళాశాలలో నిర్వహించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ కామ్ స్పిరిట్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేటలో ఉన్న గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనపరిచి అవార్డులను గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు విజేతలకు శనివారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పాటీలు కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాల విద్యార్థులకు నిర్వహించారని, పిపిటి, జూమ్, క్విజ్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను అందుకున్నారని తెలిపారు. నితిన్, సాహిత్య, అనూష, ఆశాలత, సోనాలి, శ్రీలిఖిత, ఉషారాణి, కిరణ్, హేమంత్, దిలీప్‌లు విజేతలుగా నిలిచారని అన్నారు. పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలంటే కళాశాల అధ్యాపకులు సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. గురజాడ విద్యాసంస్థల అధినేత జివి.స్వామినాయుడు, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వంగ మహేష్, సీనియర్ అధ్యాపకులు తర్ర బాలాజీ, తదితరులు గెలుపొందిన విద్యార్థులను, తల్లితండ్రులను అభినందించారు.

సంక్షేమ పాలనతో ప్రజల కళ్లలో వెలుగులు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమ పాలనతో ప్రజల కళ్లలో వెలుగులు చూస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల గడప వద్దకే మంచి పాలనను తీసుకువచ్చి జనం మెచ్చిన ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోను అందులోని హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సంక్షేమ, అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా నిలిచిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని సంక్షేమ పథకాలను నవరత్నాల పేరిట ప్రజలకు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు గ్రామ స్వరాజ్యానికి నాంది పలికాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సోమరాజు తేజ, వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, ఎంపిటిసి ప్రతినిధి కూటికుప్పల సన్యాసిరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.


లబ్ధిదారునితో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

సంక్షోభంలో విద్యుత్‌రంగం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సంక్షోభంలో విద్యుత్ రంగం ఉందని, ఇష్టానుసారం ఛార్జీలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. అరసవల్లిలోని తన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం మిగులు విద్యుత్ రాష్ట్రాల సరసన ఉండేదన్నారు. కానీ, 2022 ఏప్రిల్లో 50 యూనిట్ల కొరతతో ఆ రోజు తీవ్ర సంక్షోభం నెలకొందన్నారు. పవర్ హాలీడేలు కూడా పరిశ్రమలకు ప్రకటించాల్సి వచ్చిందన్నారు. తాజాగా ట్రూ అప్ పేరిట, ఇతర ఛార్జీల పేరిట రూ.20 వచ్చే బిల్లు ప్రస్తుతం రూ.120 వస్తుందన్నారు. కనీస ఛార్జీలన్నీ పెంచేసి ప్రభుత్వం పేదల జేబులు చిల్లులు చేస్తోందని ఆవేదన చెందారు. విద్యుత్ కొనుగోలు విషయమైలోనూ జగన్ సర్కారు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఇంతకుముందరి ఒప్పందాలు రద్దు చేసి, తమ జేబు సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు వ్యవహారాలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. రైతులకు తొమ్మిది తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పారని, కానీ, ఆ హామీని గాలికి వదిలేశారని విమర్శించారు.



కొత్తూరు : మాట్లాడుతున్న వెంకటరమణ

కొత్తూరు : ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలని ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలమట సాగర్, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, టిడిపి నాయకులు చింతాడ కోటి, ఎద్దు శ్రీనునాయుడు, గెడ్డవలస కమలాకర్, ఎం.సంతు పాల్గొన్నారు.

లొద్దలపేట విద్యార్థుల ప్రతిభ


ఓంశ్రీప్రకాష్ రుషిత

ఆమదాలవలస : మండలంలోని బెలమాం పంచాయతీ పరిధిలోని లొద్దలపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో తమ ప్రతిభను చాటారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న గురుగుబెల్లి ఓంశ్రీప్రకాష్ 96 మార్కులతో రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంకు సాధించి ఎచ్చెర్ల మండలంలోని ఎస్.ఎం.పురం పాఠశాలకు ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యాడు. అలాగే కూన రుషిత 75 మార్కులు సాధించి గార మండలంలోని వమరవెల్లి పాఠశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దుప్పల అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభపై గ్రామంలోని పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలియజేశారు.

స్పీకర్‌ను కలిసిన డిటిసి

ఆమదాలవలస : జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ శనివారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణాశాఖ సేవలను మరింత మెరుగుపరచి పురోగమన దిశలో తీసుకెళ్లాలని స్పీకర్ అన్నారు. అలాగే జిల్లాలో రవాణాశాఖ సేవలను విస్తృత పరచి ప్రజలకు మెరుగైన సేవలను అందించి వారి మన్ననలను పొందాలని సూచించారు.


స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మురళీకృష్ణ

లోవోల్టేజీ సమస్య పరిష్కరిస్తా

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో రాపాకలో కొంతకాలంగా నెలకొన్న లోవోల్టేజీ సమస్యను విద్యుత్ శాఖ ఎఇ దుర్గాప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా 'రాపాకలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య' శనివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. గ్రామంలోని రామాలయం వీధిలో శుక్రవారం రాత్రి 11 నుంచి ఉదయం 12 గంటలు వరకూ, మరలా విద్యుత్ నిలిచిపోవడంతో గ్రామస్తులు రాపాక కూడలిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులను నిలదీసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఎఇ గ్రామస్తులకు నచ్చజెప్పి రెండు రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రస్తుతం లోవోల్టేజ్ సమస్య లేకుండా తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. ఈయన వెంట జెఎల్ఎం సురేష్, సిబ్బంది ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఇ దుర్గాప్రసాద్

రైతు పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని గొడ్డ రైతు భరోసా కేంద్రంలో రైతులకు శనివారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన, మేలు జాతి వరి విత్తనాలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు. ప్రభుత్వం విత్తనాల పంపిణీ నుంచి ధాన్యం కొనుగోలు వరకూ పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. అన్నిరైతు భరోసా కేంద్రాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, తెగుళ్ల నివారణ మందులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎఒ దానకర్ణుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, మండల వైసిపి పార్టీ అధ్యక్షులు పల్లి యోగి, సర్పంచ్ ఆదిలక్ష్మి ఎంపిటిసి జన్ని శాంతమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మరో ఇద్దరు మృతి

లావేరు: మండలంలోని జాతీయ రహదారి బుడుమూరు కూడలి సమీపంలో ఈ నెల 8న టైరు పేలి మినీ వ్యాన్ బోల్తా ఘటనలో అక్కడికక్కడే ఓ విద్యార్థి మృతి చెందగా, మరో 14 మంది గాయపడ్డారు. ఇందులో నలుగురు పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. రెండు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి క్షతగాత్రుల్లో ఇద్దరు శనివారం పరిస్థితి విషమించి మృతి చెందారని ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం కొండరాజుపేటకు బాకి భవాని (13), ఉప్పాడపేటకు చెందిన దువ్వ రమణ (38) మృతి చెందినట్టు తెలిపారు. రాము, లక్ష్మిలకు ఇద్దరు సంతానంలో పెద్ద కుమారుడు మృతి చెందడంతో కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పొందూరు: మండలంలోని తోలాపి-అలమాజీపేట రహదారి పక్కన గల పొలంలో శనివారం గుర్తుతెలియని మృతదేహం (55) లభ్యమైనట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. రహదారి పక్కన పొలంలో మృతదేహం ఉన్నట్లు తోలాపి విఆర్ఒ గోవిందరావు పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎండల తీవ్రతకు మృతదేహం పూర్తిగా నల్లగా మారిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతుని జుట్టు తెల్లగా ఉండడంతో పాటు, కుడిచేతి మణికట్టు వద్ద రాగి కంకణం, వేలికి ఉంగరం ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించవచ్చునని పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

జి.సిగడాం : మండలంలోని వాంద్రంగి సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వాంద్రంగి నుంచి వస్తున్న వినోద్‌కుమార్, పొగిరి నుంచి పొందూరు వెళ్తున్న సంతోష్‌కుమార్ బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ చామంతుల రామారావుని వివరణ కోరగా... ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.


పరామర్శిస్తున్న నాయకులు

ఉప్పినివలసలో పూరిల్లు దగ్ధం

బూర్జ : మండలంలో ఉప్పినివలసలో శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన పుచ్చ చిట్టెమ్మకు భర్త లేకపోవడంతో మనవళ్లతో ఉంటుంది. రాత్రి భోజనం చేసి నిద్రిస్తుండగా... అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. వెంటనే గ్రామస్తులు అప్రమత్తమై ఇంట్లో వారిని బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆమదాలవలస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. దుస్తులు, విద్యుత్ మీటరు, ఆధార్, రేషన్ కార్డులు, విలువైన సామగ్రి కాలిపోవడంతో కట్టుబట్టలతో రోడ్డున పడింది. నిరుపేద కుటుంబానికి చెందిన చిట్టమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఎస్.వెంకటరమణ, జనసేన పార్టీ నాయకులు, కొల్లివలస ఎంపిటిసి విక్రమ్, కటకం రాజేశ్వరరావు బాధితురాలిని పరామర్శించారు.

ఎస్ఇబి ఎస్ఐగా చంద్రమోహన్

పొందూరు: పొందూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌ఛార్జి ఎస్ఐగా ఎన్ని చంద్రమోహన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జి.సిగడాం మండలం నిద్దాంకు చెందిన మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తి నుంచి మూడు రోజుల క్రితం రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మురళీలను వలపన్ని పట్టుకున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖలో ఇంటిలిజెన్స్ విభాగంలో ఎస్ఐగా పనిచేస్తున్న చంద్రమోహన్‌ను ఉన్నతాధికారులు ఇక్కడ నియమించారు.

ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరి

టెక్కలి : విద్యా సంవత్సరం ఆరంభం దృష్ట్యా ప్రయివేట్ విద్యా సంస్థలు వినియోగిస్తున్న బస్సులకు ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరిగా చేయించుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా పిట్‌నెస్ ధ్రువపత్రం చేయించుకోవాలని, లేని పక్షంలో నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుపై వాహనాలు తిరిగే సమయంలో ఎటువంటి ప్రమాదం జరిగినా సంబంధిత సంస్థలను బాధ్యులుగా చేయాలి ఉంటుందని అన్నారు.

సివిల్స్ విజేతకు మంత్రి అభినందన


అభినందిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం : సివిల్స్ విజేత చల్లా కల్యాణిని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అభినందించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి ధర్మానను శనివారం మర్యాద పూర్వకంగా ఆమె కలుసుకున్నారు. మారుమూల గ్రామం ఒప్పంగిలో పుట్టి అతిసాధారణ కుటుంబ నేపథ్యంలో పెరిగి ముందుగా గ్రూప్స్‌లో విజేతగా నిలిచారన్నారు. తరువాత పట్టుదలతో సివిల్స్‌కు సాధనకు 285వ ర్యాంకు సాధించారు. సామాన్యులకు చేరువగా ఉంటూ అత్యున్నత శిఖరాలు అందుకోవాలని మంత్రి ధర్మాన ఆకాంక్షించారు. పుట్టిన ఊరికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కళ్యాణిని కోరారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం

ప్రజాశక్తి- రణస్థలం

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎచ్చెర్ల నియోజకవర్గస్థాయి నాడు-నేడు ఫేజ్-1,2 పనులపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమన్వయం చేసుకుని త్వరితగతిన నాడు-నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, డిఇఒ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, సర్వ శిక్షా అభియాన్ ఎపిసి జయప్రకాశ్, ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, ఎంఇఒలు త్రినాధరావు, ఈశ్వరరావు, పున్నయ్య, రవి, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

డిగ్రీ సెమిస్టర్‌లో 'స్వర్ణభారతి' విజయభేరి


అభినందిస్తున్న తులసీదాసురెడ్డి

ఇచ్ఛాపురం : డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థలకు చెందిన డిగ్రీ విద్యార్థిని వలపల దుర్గాభవాని 9.3 పాయింట్లతో నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శనివారం ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణ భారతి విద్యా సంస్థలకు చెందిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ విద్యార్థులు దూసుకుపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సందీప్, చాట్ల రాము, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జయప్రకాష్, ప్రిన్సిపాల్ గౌరీశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేసవి అలవెన్స్ అందజేయాలి

ప్రజాశక్తి- నందిగాం

గతంలో అందించిన విధంగానే ఉపాధి హామీ కూలీలకు 20 నుంచి 30 శాతం వరకు వేసవి అలవెన్స్ అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.ఎల్లయ్య, ఎపి గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలన సాంబమూర్తి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ప్రతాపవిశ్వనాథపురం పంచాయతీ చెరుకుపల్లిలో చేపడుతున్న ఉపాధి కూలీలతో శనివారం మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పూటలా పనివిధానం రద్దు చేయాలన్నారు. వంద రోజుల పని చేసిన కుటుంబాలకు అదనంగా పని కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. పనిచేసే చోట టెంట్లు, తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునిగా రేయి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఆర్.పార్వతులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న ఎల్లయ్య

ఘనంగా బాలకృష్ణ జన్మదినం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అన్ని రంగాల్లోనూ అఖండ విజయభేరి మోగిస్తూ అందరి ప్రేమాభిమానాలను నందమూరి బాలకృష్ణ పొందుతున్నారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. బాలకృష్ణ 63వ జన్మదినం సందర్భంగా నగరంలోని రిమ్స్ కూడలి వద్ద జిల్లా నందమూరి తారకరామా మోక్షజ్ఞ సేవా సంఘం, డేవిడ్ టీం ఆధ్వర్యాన శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలయ్య నటుడిగా అఖండ విజయం సాధించినట్టే అటు ప్రజానాయకులు, హిందూపురం ఎమ్మెల్యేగా సేవ చేస్తూ అన్ని విధాలుగా నియోజకవర్గం అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టి నాగభూషణం, బరాటం ఉదయ్ శంకరుప్తా, గొర్లె వెంకటరమణ, కూన రామారావు, సురకాసి వెంకటరావు పాల్గొన్నారు.

పలాస : బాలకృష్ణ జన్మదినం సందర్భంగా స్థానిక ఆంజనేస్వామి ఆలయం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో అభిమానులు, తాళభద్ర బాబూరావు, గొలుసు వాసుదేవరావు, మద్దిల రాజు, దేవ, గోవర్ధన్, వసంత్‌రెడ్డి, చిన్న పాల్గొన్నారు.


పొందూరు : కేక్‌ను కట్ చేస్తున్న టిడిపి నాయకులు


పలాస : అన్నదానం చేస్తున్న అభిమానులు

పొందూరు: బాలకృష్ణ జన్మదినం సందర్భంగా స్థానిక కెవిఆర్ థియేటర్లలో టిడిపి మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిగిలిపల్లి రామ్మోహన్, వండాన మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరభాస్కర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బాడాన శేషగిరినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగ, ఎంపిటిసి మాజీ సభ్యులు కాలేపు శ్రీనివాసరావు, పైడి వాసు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- జలుమూరు

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని టెక్కలిపాడులో రూ.18 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమానికి గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని అన్నారు. విత్తనాల విక్రయం నుంచి ధాన్యం కొనుగోలు వరకు అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారానే చేపడుతున్నామని అన్నారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల పార్టీ కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, అల్లాడ, చల్లవానిపేట పిఎసిఎస్ చైర్మన్లు మొజ్జాడ శ్యామలరావు, పాగోటి రాజప్పలనాయుడు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్


పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

వైసిపి బలోపేతానికి కృషి

వజ్రపుకొత్తూరు: వైసిపి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పాతటెక్కలి ఎంపిటిసి బాలక శ్రీనివాసరావు అన్నారు. పాతటెక్కలిలో నూతనంగా నిర్మిస్తున్న వైసిపి కార్యాలయం పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 11న మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీకి సేవ చేయాలనే తలంపుతో రూ.3 లక్షలు తన సొంత నిధులతో కార్యాలయం నిర్మిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- లావేరు

వేసవి విజ్ఞాన శిబిరాలను గత నెల 8 నుంచి విద్యార్థులు చక్కగా వినియోగించుకున్నారని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మురపాక శాఖాగ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వివిధ రకాలైన ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరాల్లో రోజూ రిసోర్స్ పర్సనల్ ద్వారా కథల వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను చైతన్య పరిచామని తెలిపారు. ఈ నెల 11న ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న జయరాం

బలగ : బలగ శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యాన విద్యార్థులకు సంగీతం టీచర్ ఎస్.విశ్వేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. అనంతరం పిల్లలకు పాటల పోటీ నిర్వహించారు. బాల కథా నిలయం అధ్యక్షులు, కవి బోగేల ఉమామహేశ్వర మాట్లాడుతూ విద్యార్థుల మనసుకు ఎంతో ఉత్సాహపరుస్తాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో రిసోర్స్‌పర్సన్ మిథిల విద్యాలయం కరస్పాండెంట్ ఎం.జయరాం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. కమ శిక్షణ, జనరల్ నాలెడ్జి గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లిపెద్ది చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు మహేష్, జగదీష్, సురేష్, కిరణ్, శంకర్, సూరిబాబు, ప్రకాష్, శ్యాం పాల్గొన్నారు.


బలగ : మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు


ప్రతిష్టలో పాల్గొన్న స్పీకర్ సీతారాం

లోలుగులో ఆలయ ప్రతిష్ట

పొందూరుం : మండలంలోని లోలుగులో శనివారం పంచయతన విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం పున:ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ ప్రతిష్టలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, స్థానిక ఎంపిటిసి లోలుగు లక్ష్మంనాయుడు, మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు గాడు నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ముత్యాలపేటలో వైద్య శిబిరం

కవిటి: మండలంలోని ముత్యాలపేటలో రాజపురం ప్రభుత్వాస్పత్రి సౌజన్యంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శశిధర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజే శారు. ఎండల తీవ్రత దృష్ట్యా వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచుగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ అభిమన్యుసోయి, కేశవరావు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న సర్పంచ్ నారాయణస్వామి

వైఎస్ఆర్ బీమాతో ఆసరా

కవిటి: వైఎస్ఆర్ బీమాతో బాధిత కుటుంబానికి ఆసరా లభిస్తుందని బెజ్జిపుట్టుగా సర్పంచ్ ఎస్.పి. నారాయణస్వామి అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బెజ్జిపుట్టుగకు చెందిన బిశాయి తేజేశ్వరరావు భార్య బిసాయి శాంతికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయంగా శనివారం రూ.10వేలు అందించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుకోని పరిస్థితు ల్లో, ఆపద సమయంలో బాధితులకు వైఎస్ఆర్ బీమా అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగి పందిరి రమేష్ పాల్గొన్నారు.

దోమల నివారణతో మలేరియా దూరం

వీరఘట్టం: పరిసరాల శుభ్రతను పాటించి దోమలను నివారిస్తే మలేరియా నుంచి దూరం కావచ్చని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వ రి అన్నారు. ఈ మేరకు శనివారం మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వీరఘట్టంలో ర్యాలీ నిర్వహించారు. అపోహలు వీడి ప్రతి ఇంటిలో ఎసిఎం పిచికారీ చేయించుకోవాలని సూచించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు మట్టిబొమ్మల తయారీ పోటీ

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు మట్టి బొమ్మల తయారీ పోటీలో పాల్గొన్నారు. డ్రాయింగ్ మాష్టర్ జి. మురళీకృష్ణ పర్యవేక్షణలో మట్టితో బొమ్మలను పిల్లలు తయారు చేశారు. సమ్మర్ క్యాంప్ ముగింపు రోజు పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథా లయ అధికారి గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సంకుజోడు జలాశయం పరిశీలన


పరిశీలిస్తున్న దుర్గారావు

ప్రజాశక్తి- మందస

వైసిపి ప్రభుత్వం అధికారంలో చేపట్టి నాలుగేళ్లు కావస్తున్నా సంకుజోడు జలాశయాలపై కన్నెత్తి చూడలేదని, జలాశయాలు పూర్తిగా పాడయ్యాయని నియోజకవర్గం జనసేన నాయకులు వి.దుర్గారావు ఆందోళన వ్యక్తం చేశారు. మందస ప్రాంతంలోని సంకుజోడు జలాశయాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంకుజోడు జలాశయంలో విపరీతంగా పూడికలు పెరిగిపోయాయని, ప్రస్తుతం చిట్టడవిలా తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు లేక ఏళ్ల తరబడి డెడ్ స్టోరేజీకే పరిమితమైందన్నారు. ఇలాయితే పంట భూములకు సాగునీరు ఏలా అందుతుందని ప్రశ్నించారు. వచ్చే ఖరీఫ్‌కైనా సాగునీరు అందిస్తారా? లేదా? అంటూ ప్రభుత్వానికి ప్రశ్నించారు. 125 ఎకరాల విస్తీరణంలో ఉన్న జలాశయం 22 గ్రామాల రైతులకు 1800 ఎకరాల పంట భూములకు సాగు నీరు అందుతుందన్నారు. అనధికారకంగా మరో 1200 ఎకరాలకు సాగు నీరు అందుతుందని చెప్పారు. ఆయనతో పాటు లావేటి సురేష్, దిలీప్ కుమార్ పాణిగ్రాహి, ఎన్.ధర్మారావు ఉన్నారు.

ఇచ్ఛాపురం పాఠశాల హెచ్‌ఎంగా సింహాచలం

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా సామల సింహాచలం శనివారం బాధ్యతలు స్వీకరించారు. సింహాచలం పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం మూలిగూడలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పని చేస్తూ... ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులకు సక్రమంగా అందజేస్తానన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయ సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

అన్నారు. ఈ మేరకు పేరెంట్స్ కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.


సైకిళ్లను పంపిణీ చేస్తున్న జగన్మోహనరావు

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

శ్రీకాకుళం : రెడ్‌క్రాస్ జిల్లాశాఖ నిర్వహిస్తున్న శాంతాకళ్యాణ అనురాగ్ ఆశ్రమంలో ఉన్న అనాథ పిల్లలకు శనివారం సైకిళ్లను పంపిణీ చేశారు. పిల్లలు కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దాతలు బి.వి.వి.కృష్ణకుమార్, బిందు, శ్రీమన్నారాయణ, భాని, సన్వితలు మానవతా దృక్పథంలో రెడ్‌క్రాస్‌కు సైకిళ్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ అనురాగ్ నిలయంలో ఉన్న పిల్లలు అమ్మ, నాన్న, తాత, అమ్మమ్మ, నానమ్మ లేక చదువుకు దూరమవుతున్న తరుణంలో రెడ్‌క్రాస్ చేరదీసిందన్నారు. వారి ఆలన, పాలన చూస్తుందని, మిగతా దాతలూ మానవత్వంతో స్పందించి విరాళాలు పిల్లల విద్యాభివృద్ధికి దోహదపడతారని కోరారు. కార్యక్రమంలో అనురాగ నిలయం కమిటీ సభ్యులు నిక్కు అప్పన్న, కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

బీమా.. పాడి రైతులకు ధీమా

సీతంపేట: పశువుల బీమా పథకం ప్రభుత్వం మంజూరు చేయడంతో రైతులకు కొంత ప్రోత్సాహం కలిగింది. దీంతో పశువులు ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు, వివిధ కారణాలతో మృతి చేందితే ఆ రైతు నష్టపోకుండా ప్రభుత్వం పశు బీమా పథకం ఏర్పాటు చేసిన ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ప్రీమియం లభిస్తుంది. ఈ బీమా తెల్లరేష న్ కార్డు ఉన్న పాడి రైతుకు మాత్రమే వర్తిస్తుంది. దీనిపై ఇప్పటికే పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, దోనుబాయి పశు వైద్యాధికారి వెటర్నరీ సిబ్బంది భాస్కరరావు గిరిజన గ్రామాల్లో పశు బీమా పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో సుమారు 15 వేలు ఆవులు, గేదేలు, 25వేల మేకలు, గొర్రెలు ఉన్నాయి. జెర్సీ ఆవులు బట్టి రూ.30వేలు విలువచేసే ఆవుకు రూ.1920 ఇన్సూరెన్స్ కు వీటిలో ప్రభుత్వం సబ్సిడీ రూ.1536, లబ్ధిదారుని వాటా 384 ఆదనంగా జిఎస్టి ఛార్జీలు సుమారు రూ.15 వరకు పడతాయి. నాటు ఆవుకు రూ.15వేలు ప్రీమియం ఉండగా, బీమా రూ.960. దీనిలో ప్రభుత్వం సబ్సిడీ 768 రైతు వాటా 192 రూపాయలు జీఎస్టీ అదనంగా ఉంటుంది. పశు బీమా పథకం మూడేళ్ల వరకు వర్తిస్తుంది. ఇప్పటికే గ్రామాల్లో పశుసంవర్ధ శాఖ సిబ్బంది సచివాలయ వెటర్నరీ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. రేషన్ కార్డు లేని పాడి రైతులకు రూ.30వేలు ప్రీమియం ఉంటే ఇన్సూరెన్స్ రూ.1920 ఉండగా, ప్రభుత్వం సబ్సిడీ రూ.960, లబ్ధిదారుని వాటా రూ. 960 ఉంటుంది. పాలసీ జనరేట్ చేసి 15 రోజుల తర్వాత మృతి చెందిన ఆవుకు ఇది వర్తిస్తుంది.

హక్కులను కాలరాస్తున్న బిజెపి

వీరఘట్టం: రాజ్యాంగం కల్పించిన హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తుందని ఎఐసిసిటియు నేషనల్ కౌన్సిల్ సభ్యులు బి.వాసుదేవరావు విమర్శించారు. ఈ మేరకు శనివారం మండలంలోని చలివేంద్రలో ఎఐసిసిటియు విస్తృత కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కనీసం ప్రాథమిక హక్కుల్ని కాపాడుకోవడానికి కార్మికులు, విద్యార్థి, యువకులు, మేధావులు, సమైక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. మెరుగైన వేతనం, రోజువారి పని, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనం, విద్య, వైద్యం గృహ వసతి కోసం భవన నిర్మాణ కార్మికులు పోరాడాలని ఆ దిశగా జులై 8, 9 తేదీల్లో కన్యాకుమారిలో జరుగు నాలుగువ జాతీయ మహాసభలను



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎఐసిసిటియు నాయకులు

విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ మండలాల నుండి భవన నిర్మాణ కార్మికులు, ఆశ, ఆటో కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని దుక్కవానిపేటలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. గ్రామ దేవత నీలమ్మ తల్లి ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి. జిల్లాస్థాయిలో 45 జట్టులు పాల్గొన్నాయి. లీగ్ దశలో మురిపింటివానిపేట జట్టుపై కొండవూరు, చిన్నమురహరిపురం జట్టుపై మామిడిపల్లి జట్టు విజయం సాధించారు. కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు రిఫరీలుగా వ్యవహరిస్తున్నారు.

27న నాయీబ్రాహ్మణ గర్జన

పలాస : నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న శ్రీకాకుళంలో నాయీబ్రాహ్మణ గర్జన నిర్వహిస్తున్నామని టెక్కలి డివిజన్ అధ్యక్షులు కర్రెన్న అన్నారు. పలాసలో నాయీబ్రాహ్మణ సంఘం శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల గణన ద్వారా బిసిఎ కేటగిరీలో వర్గీకరణ చేసేందుకు ప్రభుత్వం ఓ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాం డ్ చేశారు. 50 ఏళ్లు దాటిన నాయీబ్రాహ్మణులకు పింఛను అందించాలన్నారు. ఆధునిక సౌందర్య పద్ధతులపై నైపుణ్యాపై ఉచితంగా శిక్షణ ఇప్పించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాళ్లపేట అప్పారావు, సభ్యులు నౌగాపు దండాసి, లక్కవరపు పాపారావు, కల్లేపల్లి మల్లేశ్వర రావు, వీరాస్వామి, మేఘవరపు లక్ష్మీనారాయణ, తాళభద్ర గోపి, నాగరాజు, కృష్ణారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుమలేష్

బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి- బూర్జ

ప్రస్తుత పాలనలో బిసిలకు తీవ్ర అన్యాయం చేస్తుందని టిడిపి బిసి సాధికారిక నగరాలు రాష్ట్ర కన్వీనర్ తిరుమలేష్ అన్నారు. మండలంలోని చీడివలసలో బిసిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ బిసిలంతా ఐక్యంగా పోరాడి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో బిసిలకు అన్యాయం జరిగిందని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కోత పెట్టారని పేర్కొన్నారు. బిసిలపై దాడులు, తప్పుడు కేసులు బనయించడం వంటి అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి బిసి సాధికారతం జిల్లా అధ్యక్షుడు నల్లాన వెంకునాయుడు, రాష్ట్ర డైరెక్టర్లు పిల్ల కన్నంనాయుడు, నల్లన గిరిధర్, వేపారి వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి శంకుస్థాపన

పాలకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలో ని ముదునూరు వారి వీధిలో బెవర గోపాల నాయుడు అన్నదాన సత్రం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ అన్నదాన సత్రం రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం జరుగుతుంది. బెవర గోపాల నాయుడు కుటుంబ సభ్యులు రూ.ఆరు లక్షలు విరాళంగా ఇవ్వగా, మిగిలిన రూ.24 లక్షలు దేవాదాయ శాఖ అందజేసింది. కార్యక్రమంలో శ్రీ బెవర గోపాల నాయుడు కుటుంబ సభ్యులు, కౌన్సిలర్స్, దేవాదాయ, ధర్మదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సత్రంలో 30 మంది విద్యార్థులకు అవకాశం ఉందని, ఈ సత్రంలో ఇంతవరకు చదివిన విద్యార్థులు ఎంతో మంచి స్థానంలో ఉన్నారని శాసన మండలి సభ్యులు విక్రాంత్ తెలిపారు.